


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 22.05.2026 | సంపుటి: 3 | సంచిక: 110 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 22.05.2026 | VOLUME : 3 | ISSUE : 110 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## ఫిట్‌నెస్ ఉంటేనే
# బస్సు కదులుద్ది!

- విద్యాసంస్థల ప్రారంభానికి ముందే రవాణా శాఖ నోటీసులు..
- పక్షం రోజుల ముందే అప్రమత్తం.. విద్యార్థుల భద్రతే పరమావధి..
- స్కూళ్లు, కాలేజీలు తెరిచే లోపే రవాణా వాహనాలపై ప్రత్యేక ఫోకస్
- నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్.. క్రిమినల్ కేసులు
- తెలంగాణవ్యాప్తంగా 32 వేల ప్రైవేట్ బస్సులు..
- వాహనాల హిస్టరీతో పాటు డ్రైవర్ల ట్రాక్ రికార్డుపై ఆరా..
- ఏటా వందల సంఖ్యలో బలవుతున్న చిన్నారుల ప్రాణాలు

3





# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

- కనీస వేతనాలు అమలుకు నిర్ణయం
- కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- లబ్ధిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- బండి తనయుడు భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారు
- కేటీఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మే 21(రాజముద్ర న్యూస్):**
కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 2వ పేజీలో..

## ఏఐ ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు
2

## దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత రాజీవ్
2

## వైభవంగా సరస్వతి నది అంత్య పుష్కరాలు షురూ

- తొలి పుష్కర స్నానమాచరించిన కంచి పీఠాధిపతి, మంత్రులు
- తరలివస్తున్న భక్తులు
- భక్తి పారవశ్యంతో పులకిస్తున్న త్రివేణి సంగమం

2



## ధరణి సమస్యలకు
# శాశ్వత పరిష్కారం

- అర్హులందరికీ భూ పట్టాలు అందిస్తాం
- జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం, మే 21 (రాజముద్ర న్యూస్):**
ధరణి వ్యవస్థ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ భూ పట్టాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని ఎంఆర్ గార్డెన్స్‌లో ప్రజా పాలన - ప్రగతి

మిగతా 2వ పేజీలో..



## మహిళా సాధికారతకు రాష్ట్రవ్యాప్తంగా వారోత్సవాలు

- మే 25 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- [illegible] స్వావలంబనపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి
- జీవనోపాధి యూనిట్లు, రుణమేళాలు, ఆరోగ్య కార్యక్రమాలు
- మంత్రి సీతక్క

2





## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

- ఆయుధాలతో సహా లొంగిపోయిన 25 మంది మావోలు
- ఝూర్ఖండ్ డీజీపీ సమక్షంలో లొంగిపోయిన 25 మంది మావోయిస్టులు
- లైట్ మెషీన్ గన్స్ సహా పలు రకాల ఆయుధాల అప్పగింత
- అందరికీ పూర్తి పునరావాసం కల్పిస్తామన్న డీజీపీ

3

## రేవంత్ అబద్ధం చెప్పారా..? బండి సంజయ్ అబద్ధం చెప్పారా..?



- భగీరథ్ అరెస్ట్‌పై సీఎం, కేంద్ర మంత్రి వ్యాఖ్యలకు పొంతనేది?
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్న
- అసలు జరిగింది అరెస్టా..? సరెండరా..? అంటూ నిలదీత

3

## ఎన్నాళ్లు మొద్దునిద్ర.. రైతులపై దృష్టి పెట్టండి

- పంట కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల అవస్థలపై కేటీఆర్ ఆగ్రహం
- మరణించిన రైతు కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం డిమాండ్



3



## తెలంగాణకు కేంద్రం మరో బంపర్ గిఫ్ట్..

- రూ.5,818 కోట్లతో కొత్త రైల్వే లైన్.!
- మణుగూరు–రామగుండం కొత్త రైల్వే లైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- మేడారం, భద్రాచలం భక్తులకు భారీ ఊరట

**తెలంగాణ బ్యూరో, మే21 (రాజముద్ర న్యూస్):**
తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం మరో సూపర్ గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కీలకమైన మణుగూరురామగుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దాదాపు

మిగతా 3వ పేజీలో..

# మందుబాబులకు షాక్

- జూన్ 2 తర్వాత మద్యం ధరల మోత
- తెలంగాణలో అన్ని రకాల లిక్కర్, బీర్లపై పెంపు సంకేతాలు
- 10–15 శాతం వరకు ధరలు పెంచే యోచనలో ప్రభుత్వం
- తయారీ వ్యయాల పెరుగుదలే ప్రధాన కారణమంటున్న సంస్థలు

**హైదరాబాద్, (రాజముద్ర న్యూస్):**
తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం అనంతరం అన్ని రకాల లిక్కర్, బీర్ల ధరలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం ప్రకటించే అవకాశముందని అధికార వర్గాల్లో చర్చ

మిగతా 3వ పేజీలో..





## ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి**

ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.

గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, ధరణి వ్యవస్థలోని లోపాల కారణంగా రైతులు, పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. ఈ సమస్యలకు పరిష్కారంగా రైతులకు అండగా నిలిచే భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. గతంలో భూ రికార్డులు కొందరి ఆధీనంలో ఉండేవని, ప్రస్తుతం పేదలకు భూములపై పూర్తి హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.సత్తుపల్లి పట్టణ పరిధిలోని 399 సర్వే నంబర్‌తో పాటు పరిసర గ్రామాల్లో ఉన్న దాదాపు 6,500 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పెదపల్లి, నారాయణపురం ప్రాంతాల్లో 5,500 ఎకరాలకు పైగా ఉన్న భూములను క్షేత్రస్థాయిలో పూర్తిగా కొలిచి అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు.రుద్రాక్షపల్లి, కొకపాడు, తాళపెంట, రామచంద్రాపురం, వెంకటగిరి ప్రాంతాలతో పాటు సరిహద్దు గ్రామాల్లో కొనసాగుతున్న అటవీ, రెవెన్యూ భూముల వివాదాలను వర్షాకాలానికి ముందే పరిష్కరించాలని సూచించారు. సరిహద్దు గుర్తింపులు పూర్తి చేసి వివాదాలను శాశ్వతంగా ముగించాలని అధికారులకు స్పష్టం చేశారు. అటవీ భూములు మినహా మిగిలిన రెవెన్యూ భూములను తరతరాలుగా సాగు చేస్తున్న పేదలకు భూ పట్టాలు అందించే బాధ్యత తనదేనని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి ప్రాంతాల ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. రెవెన్యూ, గృహనిర్మాణం, అటవీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## మహిళా సాధికారతకు రాష్ట్రవ్యాప్తంగా వారోత్సవాలు

**హైదరాబాద్, మే 21**

మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా వారోత్సవాలను నిర్వహించనుంది. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా వారంరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, యువతులు, బాలికలు, దివ్యాంగులు, వృద్ధులు సహా అన్ని వర్గాల మహిళలను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయనున్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన, జీవనోపాధి అవకాశాల విస్తరణ, సామాజిక భద్రత, ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక సమావేశాలు, రుణమేళాలు, జీవనోపాధి యూనిట్ల ప్రారంభాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.


మే 29న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇంక్యుబేటర్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే రోజు జీవనోపాధి యూనిట్లు, రుణమేళాలు కూడా నిర్వహించనున్నారు. కోళ్ల పెంపకం యూనిట్లు, సూక్ష్మ పరిశ్రమలు, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు, తేనేటీగల పెంపకం కేంద్రాల వంటి పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళా సంఘాలను కేవలం పొదుపు సమూహాలుగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఉత్పాదక శక్తులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళలకు బ్యాంకు రుణాలు, ఉపాధి అవకాశాలు, సూక్ష్మ పరిశ్రమలు, సౌర విద్యుత్ ప్రాజెక్టుల వంటి అవకాశాలను గ్రామస్థాయికే తీసుకెళ్తున్నామని తెలిపారు.

మే 25న సౌర విద్యుత్ ప్లాంట్ల ప్రారంభంతో పాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచే 450 ఆర్టీసీ బస్సులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పోషకాహార అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. మే 26న సామాజిక సమీకరణ కార్యక్రమాలు, బాలికలతో మాదిరి శాసన సభ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మే 28న మహిళా సంఘ భవనాలు, గోదాములు, పనిశాలల నిర్మాణాలకు శంకుస్థాపనలు జరగనున్నాయి. మే 30, 31 తేదీల్లో మహిళల భద్రత, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా సమాఖ్య భవనాల ప్రారంభం, బాలికలకు సైకిళ్ల పంపిణీ, ఆరోగ్య శిబిరాలు, మహిళల ఆరోగ్య పరీక్షలు కూడా చేపట్టనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి సీతక్క అధికారులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు.




# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

**మొదటిపేజీ తరువాయి**

మాట్లాడుతూ.. "కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్1లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్2లో మున్సిపాలిటీలు, జోన్3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీస వేతనం నిర్ణయించాం" అన్నారు.

అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు.

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు.

ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం.

బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు.

కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యింది. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు?.

కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం. "జనగణనలో కులగణన" విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలి" అని అన్నారు.

# ఏఐ ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు

**హైదరాబాద్, మే21:**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్న నేపథ్యంలో యువత తమ దృక్పథాన్ని పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో స్కిల్డ్, సెమీ స్కిల్డ్ బ్లూ కాలర్ ఉద్యోగాలకు ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఉంటుందని, అలాంటి ఉద్యోగాలను ఏఐ భర్తీ చేయలేదని పేర్కొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడిన సీఎం, మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా యువత వైఖరిలో మార్పు రావాలని సూచించారు. "ఏఐ వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. కానీ సాంకేతిక నైపుణ్యం కలిగిన బ్లూ కాలర్ ఉద్యోగాలకు మంచి అవకాశాలు ఉన్నాయి" అని తెలిపారు.

బ్లూ కాలర్ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామని, ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాన్ని అందించే ఏటీసీలుగా మార్చామని చెప్పారు. అన్ని పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు.

"ఏ కోర్సు చదివినా ఉద్యోగం లేదా ఉపాధి అవకాశం రావాలి. సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకుంటే జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాల్లో భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. అక్కడ జీవన ప్రమాణాలు కూడా మెరుగ్గా ఉన్నాయి" అని పేర్కొన్నారు.

ఇంగ్లీష్ రాకపోయినా కొన్ని దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు. ఆ దేశాల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు జర్మన్, జపనీస్ భాషలను నేర్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఒప్పందాలు చేసుకుందని తెలిపారు.

"పాతికేళ్ల క్రితం ఐటీ, కంప్యూటర్ కోర్సులు చేసి అమెరికా వెళ్లాలనే ఆలోచన ఉండేది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఏఐ తుఫానులో అమెరికానే ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది" అని వ్యాఖ్యానించారు.

ప్రపంచ దేశాలకు ప్రత్యామ్నాయంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చెప్పారు. మారుతున్న పరిస్థితులను అంచనా వేసుకుని యువత బ్లూ కాలర్ ఉద్యోగాల అనుకూలతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.




# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

- **సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్**
- **రాజీవ్‌కు నివాళి అర్పించిన సీఎం రేవంత్**

**హైదరాబాద్, మే 21:**

దేశం కోసం ప్రాణాలర్పించిన మహానాయకుడు రాజీవ్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు.

"కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియా గాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది" అని పేర్కొన్నారు.మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నిందన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారని విమర్శించారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మహిళా బిల్లును మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన నాయకుడు రాజీవ్ అని పేర్కొన్నారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని చెప్పారు.



రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు.

రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సరస్వతి నది అంత్య పుష్కరాలు షురూ

**జయశంకర్ భూపాలపల్లి, మే 21 :**

కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోచ్ఛారణలతో మారుమోగింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగమంలో గురువారం ఉదయం 5.43 నిమిషాలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. గురువారం వేకువజామునే త్రివేణి సంగమ తీరాన సరస్వతి నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. ఇప్పటివరకూ సాంప్రదాయానికే పరిమితమైన సరస్వతి అంత్య పుష్కరాలు ఈసారి అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

**గణపతి పూజతో..**

గోదావరి, ప్రాణహిత నదులు కలిసినచోట అంతర్వాహినిగా సరస్వతి నది ఉద్భవించిన ప్రాంతంలో ఉదయం 5.43 గంటలకు సరస్వతి పుష్కరాలు ప్రారంభం అయ్యాయి. గోదావరి పుష్కరాల సమయంలో (వీఐపీ ఘాట్) సరస్వతి ఘాట్‌లో సరస్వతి నది పుష్కరాలను నిర్వహిస్తున్నారు. కంచి స్వామితోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఆయన సతీమణి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హై కోర్టు న్యాయమూర్తి నందా, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి, రంగారెడ్డి ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, ట్రేడింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, ఇతర ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతి అంత్య పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై పుణ్య స్నానాలాచరించారు. తొలుత విఘ్నాధిపతి అయిన విఘ్నేశ్వరునికి తొలి పూజలు చేసిన తరువాత అంత్య పుష్కర మహోత్సవ వేడుకలకు అంకురార్పరణ చేశారు.

**కంచి పీఠాధిపతిచే..**

అత్యంత అరుదైన సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పుష్కర స్నానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద పండితులు సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని, శ్రీ శుభానంద దేవిని, సరస్వతి మాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పుష్కరాలు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీ నేతృత్వంలోని జిల్లా యంత్రాంగం కొన్ని రోజులుగా అవిశ్రాంతంగా శ్రమించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పుష్కర స్నానాలు ఆచరించి చదువుల తల్లి సరస్వతి మాత అశీస్సులు పొందాలని ఆయన ఆకాంక్షించారు.

**అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం**

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా వంటి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ పుణ్యకాలంలో భక్తులు సౌకర్యవంతంగా, సురక్షితంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ అంత్య పుష్కరాలు పన్నెండు రోజులపాటు కొనసాగుతాయి. ఆచరించిపుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. పుణ్య స్నానాలు ఆచరించి శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించే భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పలు ధార్మిక సంఘాలు ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తున్నాయి, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ఎండ తీవ్రతనుంచి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు.

**ఆలయ విశిష్టతలు**

భారత దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒకే పానవట్టంపై యముడు (కాళేశ్వరుడు) శివుడు (ముక్తేశ్వరుడు) కొలువై ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత. ఇక్కడ కాళేశ్వరునికి పూజలు చేసిన తర్వాతే ముక్తేశ్వరునికి పూజలు చేయడం ఆనవాయితీ. ముక్తేశ్వర లింగం పైభాగంలో రెండు చిన్న రంధ్రాలు ఉంటాయి. ఎంత నీటితో అభిషేకం చేసినా ఆ నీరు అందులోనే ఇంకిపోవడం ఒక అద్భుతం. భక్తులు తమ పాపాలు తొలగిపోవడానికి, మృత్యు భయం తొలగిపోవడానికి ఆలయంలోని 'యమకోణం' (ఒక చిన్న సందు) గుండా వెళ్లడం ఒక ముఖ్యమైన ఆచారం.

# రేవంత్ అబద్ధం చెప్పారా..? బండి సంజయ్ అబద్ధం చెప్పారా..?

**హైదరాబాద్, మే 21:**

పోక్సో కేసు నిందితుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్ట్ వ్యవహారం రాజకీయంగా దుమారం రేపుతోంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. "అసలు జరిగింది పోలీసుల అరెస్టా..? లేక లాయర్ల సమక్షంలో జరిగిన సరెండరా..?" అని ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధం చెబుతున్నారా..? లేక కేంద్ర మంత్రి బండి సంజయ్ అబద్ధం చెబుతున్నారా..? అని నిలదీశారు.

"ఈరోజు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు మధ్యలో నాకాబందీ నిర్వహించి బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారని, ఇందులో రాజకీయ కోణం లేదని చెప్పారు. పోలీసుల మాట నమ్మాలని పేర్కొన్నారు" అని ప్రవీణ్‌కుమార్ గుర్తుచేశారు.

అదే సమయంలో బండి సంజయ్ మాత్రం భిన్నంగా స్పందించారని తెలిపారు. "నేను బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రిగా, రాజకీయ నాయకుడిగా నా కొడుకును నా లాయర్ల ద్వారా పోలీసులకు సరెండర్ చేశాను" అని బండి సంజయ్ స్పష్టంగా ప్రకటించారని చెప్పారు.

ఈ నేపథ్యంలో "మనం రాష్ట్ర ముఖ్యమంత్రిని నమ్మాలా..? లేక దేశ హోంశాఖ సహాయ మంత్రిని నమ్మాలా..?" అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు.



# మందుబాబులకు షాక్

**మొదటిపేజీ తరువాయి**

జరుగుతోంది. అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంతో పాటు తయారీ సంస్థల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

మద్యం తయారీ సంస్థలు గత కొంతకాలంగా ధరల సవరణ కోరుతున్నాయి. ముడిసరుకుల ధరలు పెరగడం, గాజు సీసాల తయారీ వ్యయం అధికమవడం, కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడం వల్ల తయారీ ఖర్చులు గణనీయంగా పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో మొత్తం ఉత్పత్తి వ్యయం 15 నుంచి 20 శాతం వరకు పెరిగిందని వెల్లడిస్తున్నాయి.

మద్యం ధరల పెంపుపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఇప్పటికే నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులతో పాటు పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న ధరలను పరిశీలించిన కమిటీ 25 నుంచి 30 శాతం వరకు పెంపు సాధ్యమని సూచించినట్లు సమాచారం. అయితే ఒకేసారి భారీగా ధరలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ప్రస్తుతం 10 నుంచి 15 శాతం వరకు మాత్రమే పెంపు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే సాధారణ బ్రాండ్ల నుంచి ప్రీమియం బ్రాండ్ల వరకు అన్ని రకాల మద్యం, బీర్ల ధరలు పెరగనున్నాయి. ధరల పెంపుతో ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరనుండగా, వినియోగదారులపై అదనపు భారం పడనుంది. దీనికి సంబంధించిన ప్రక్రియను ఆర్థిక, అబ్కారీ శాఖలు ఇప్పటికే పూర్తి చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

**సిరిన్యూస్‌టుడే**

ఝార్ఖండ్‌లో మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని మరో దెబ్బ తగిలింది. 25 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ సమక్షంలో వీరు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు సబ్ జోనల్ కమాండర్లు, మరో ఆరుగురు ఏరియా కమాండర్లు, 13 మంది చురుకైన హార్డ్‌కోర్ సభ్యులు ఉన్నారు. వీరంతా సుదీర్ఘకాలంగా ఝార్ఖండ్‌లోని అత్యంత క్లిష్టమైన కోలహాన్, దట్టమైన సరండ అటవీ ప్రాంతాలలో తమ సాయుధ కార్యకలాపాలను నిర్వహిస్తూ భద్రతా దళాలకు సవాలుగా మారారు.

ఈ లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇందులో ఎల్ఎమ్‌జీ, ఇన్సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్ లు, 303 రైఫిళ్లు, దేశవాళీ తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో మహిళా మావోయిస్టులు కూడా ఉండటం గమనార్హం. 100కు పైగా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉండి, సుదీర్ఘకాలంగా మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న టాప్ కమాండర్ సాగెన్ అంగారియా అలియాస్ డొకోల్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇంతటి కీలక నేతలు, కేడర్ ఒకేసారి ప్రధాన స్రవంతిలోకి రావడంతో ఝార్ఖండ్‌లో మావోయిస్టు పార్టీ నెట్‌వర్క్ పూర్తిగా బలహీనపడినట్లయింది. ఈ సందర్భంగా ఝార్ఖండ్ డీజీపీ మాట్లాడుతూ... రాష్ట్రంలో తీవ్రవాదాన్ని, నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు భద్రతా దళాలు సమష్టిగా, వ్యూహాత్మకంగా పనిచేస్తున్నాయని కొనియాడారు. హింసను వీడి వచ్చిన వీరందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని, సమాజంలో గౌరవప్రదంగా బతికేందుకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఇంకా అడవుల్లో అజ్ఞాతంలో కొనసాగుతున్న మిగిలిన మావోయిస్టులు కూడా తక్షణమే హింసా మార్గాన్ని విడనాడి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వాడుకుంటూ ప్రధాన స్రవంతిలోకి రావాలని సీఆర్పీఎఫ్ ఐజీ సాకేత్ సింగ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# ఫిట్‌నెస్ ఉంటేనే బస్సు కదులుద్ది!

**తెలంగాణ బ్యూరో, మే 21:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల పునః ప్రారంభానికి ముందే రవాణా శాఖ అత్యంత అప్రమత్తమైంది. ఏటా స్కూళ్లు, కాలేజీలు తెరిచిన తర్వాత ప్రమాదాలు జరగడం, ఆపై తనిఖీలు చేపట్టడం పరిపాటిగా మారిన తరుణంలో.. ఈసారి ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలపై గట్టిగా దృష్టిసారించింది. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడానికి మరో పక్షం రోజుల గడువు ఉండగానే విద్యావాహనాల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల రవాణా వ్యవస్థలో ఎలాంటి లోపాలు, ప్రమాదాలకు తావుండకూడదన్న ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా.. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలకు రవాణా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలంటూ ఇప్పటికే అధికారికంగా నోటీసులు జారీ చేసింది.

**గ్రేటర్ పరిధిలోనే 20 వేల బస్సులు..**

తెలంగాణవ్యాప్తంగా దాదాపు 32 వేల ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు ఉండగా.. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే 20 వేలకు పైగా బస్సులు విద్యార్థులను తరలించడానికి సిద్ధమవుతున్నాయి. ఇవి కాకుండా వేలాది సంఖ్యలో ఆటోలు, మినీ వ్యాన్లు కూడా నడుస్తున్నాయి. ప్రస్తుతం రవాణా శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఈ అన్ని వాహనాల వివరాలను సేకరిస్తున్నారు. వాహనం తయారీ తేదీ, ఫిట్‌నెస్ పరిస్థితి, ఇన్సూరెన్స్ తదితర వివరాలను అందించాలని ప్రైవేట్ విద్యాసంస్థలను ఆదేశించింది. నిబంధనలు పాటించని, ఫిట్‌నెస్ లేని వాహనాలను విద్యాసంస్థలు ప్రారంభమయ్యే నాటికి ముందస్తుగానే సీజ్ చేసేందుకు రవాణా శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది.

**ప్రత్యేక తనిఖీల్లో పరిశీలించే అంశాలు ఇవే..**

డ్రైవర్ల నిర్లక్ష్యం, వాహనాల్లోని సాంకేతిక లోపాల కారణంగా ఏటా వందలాది మంది విద్యార్థులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. మరికొందరు శాశ్వత వైకల్యం పొంది జీవితాలను కోల్పోతున్నారు. ఈ ఘోరాలను అరికట్టడమే లక్ష్యంగా రవాణా శాఖ రంగంలోకి దిగింది. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అధికారులు ప్రధానంగా ఈ క్రింది అంశాలపై సంపూర్ణ సమాచారాన్ని సేకరిస్తున్నారు.

డాక్యుమెంట్ల పరిశీలన.. వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ ఉన్నాయా లేదా? డ్రైవర్ల ట్రాక్ రికార్డు.. డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు తగిన అనుభవం ఉందా?

భద్రతా సౌకర్యాలు.. బస్సుల్లో అత్యవసర సమయాల్లో ఉపయోగపడే ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్ (అగ్నిమాపక పరికరం), ఎమర్జెన్సీ ఎగ్జిట్ సక్రమంగా పనిచేస్తున్నాయా? యాంత్రిక ఫిట్‌నెస్.. వాహనాల బ్రేకులు, టైర్లు, ఇండికేటర్లు, హెడ్‌లైట్లు మరియు ఇతర యాంత్రిక భాగాలు సక్రమంగా ఉన్నాయా? స్టాఫ్ పర్యవేక్షణ.. విద్యార్థుల భద్రతను పర్యవేక్షించేందుకు బస్సులో ప్రత్యేకంగా అటెండర్‌ను నియమించారా లేదా? ఈ నిబంధనల్లో ఏ ఒక్కటి ఉల్లంఘించినా మోటార్ వాహన చట్టం ప్రకారం వాహనాలను వెంటనే సీజ్ చేయడంతో పాటు, డ్రైవర్లు మరియు సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

**యాజమాన్యాలదే పూర్తి బాధ్యత**

విద్యాసంస్థల విద్యార్థులను రవాణా చేసే వాహనాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పాటింపు యొక్క పూర్తి బాధ్యత సంబంధిత పాఠశాల, కళాశాల యాజమాన్యాలదేనని రవాణా శాఖ స్పష్టం చేసింది. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని, స్కూల్ యాజమాన్యాలే చట్టానికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అందువల్ల యాజమాన్యాలు తమ వాహనాలను క్రమం తప్పకుండా ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరు పరిచి, సర్టిఫికేట్లు పొందాలని సూచించింది.

**తల్లిదండ్రులకు కీలక విజ్ఞప్తి**

ఇదే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా రవాణా శాఖ ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేసింది. కేవలం తక్కువ ఖర్చు వస్తుందనో, సౌకర్యంగా ఉంటుందనో అధిక సంఖ్యలో విద్యార్థులను కుక్కి కుక్కి ఎక్కించుకునే ఆటోలు, వ్యాన్లలో తమ పిల్లలను పంపవద్దని సూచించింది. ఒకవేళ రవాణా శాఖ తనిఖీలలో ఫిట్‌నెస్ లేని లేదా ఓవర్‌లోడ్ చేస్తున్న వాహనాలను సీజ్ చేస్తే.. విద్యార్థులు మధ్యలోనే రోడ్లపై ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అందువల్ల, తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ప్రయాణించే వాహనాల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలు, అనుమతులపై ముందుగానే స్కూల్ యాజమాన్యాలను అడిగి నిర్ధారించుకోవాలని, పిల్లల సురక్షిత ప్రయాణానికి భాగస్వాములు కావాలని కోరింది.

# కులగణనలో తెలంగాణ దేశానికి దిక్సూచి

- సుప్రీంకోర్టు నిర్ణయంపై హర్షం
- కేంద్రానికి ముఖ్యమంత్రి కీలక డిమాండ్
- తెలంగాణ నిర్ణయానికి గౌరవమన్న వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 21**



జనగణనలో కులగణన అంశాన్ని చేర్చడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి దశ, దిశ చూపించిన రాష్ట్రంగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనాభా లెక్కల్లో కులగణన అంశాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి మరింత బలం చేకూరిందని అభిప్రాయపడ్డారు.

సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే దేశవ్యాప్తంగా కులగణనను అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కులగణన చేపట్టి సమగ్ర సమాచారాన్ని సేకరించిందని గుర్తుచేశారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలకు సంబంధించిన సమగ్ర కుల సర్వేను నిర్వహించి వివరాలను ప్రజల ముందుంచామని ముఖ్యమంత్రి తెలిపారు. బలహీన వర్గాల్లో నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.

కులగణన అంశాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం మంచి పరిణామమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం పరోక్షంగా సమర్థించడం రాష్ట్రానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు తెలంగాణ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేసిందని ముఖ్యమంత్రి అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా రాష్ట్రం ముందడుగు వేసిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి చర్యలు చేపడితే బలహీన వర్గాల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సమగ్ర సమాచారంతో సంక్షేమ విధానాలు మరింత సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

# ఎన్నాళ్లు మొద్దునిద్ర.. రైతులపై దృష్టి పెట్టండి

**హైదరాబాద్, మే 21**

రాష్ట్రంలో పంట కొనుగోళ్ల వ్యవస్థ పూర్తిగా సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ నెల 23న జరగనున్న కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం రైతు సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి ధాన్యంతో వేచి ఉండాల్సి వస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండుతున్న ఎండల్లో, వడదెబ్బల మధ్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా రైతుల సమస్యలపై చూపించాలని విమర్శించారు. కొనుగోలు ప్రక్రియలో ఆలస్యాల కారణంగా ఇప్పటివరకు దాదాపు 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఖమ్మం వరకు అనేక ప్రాంతాల్లో ధాన్యం లారీల ఎత్తివేత సరిగా జరగడం లేదన్నారు. కొనే చోట్ల కూడా క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు. గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచే డిపాజిట్ వసూలు చేయడం దారుణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ముందస్తు ప్రణాళికలతో రైతులకు భరోసా కల్పించారని కేటీఆర్ గుర్తుచేశారు. కరోనా సమయంలో కూడా రైతుల వద్దకే వెళ్లి చివరి గింజ వరకు కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ ప్రస్తుతం అకాల వర్షాల సమయంలో పంటను రక్షించేందుకు అవసరమైన టార్పాలిన్లు కూడా ప్రభుత్వం అందించలేకపోతోందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన బోనస్ హామీ అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు. కనీసం మద్దతు ధరకు కొనుగోళ్లు కూడా చేయలేకపోతే ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద మరణించిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఆందోళనలు పెరుగుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే గట్టి సమాధానం చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు. రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

# కేంద్ర అధికారుల పర్యటనలతో రాష్ట్ర శాఖలకు కొత్త తలనొప్పి

- అధిక సదుపాయాల డిమాండ్లతో అధికారుల్లో ఆందోళన

**హైదరాబాద్, మే21:**

కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల రాష్ట్ర పర్యటనలు కొన్ని శాఖల అధికారులకు సవాలుగా మారుతున్నాయనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో సాగుతోంది. కేంద్ర నిధులతో అమలవుతున్న పథకాల సమీక్షలు, సమావేశాలు, తనిఖీల కోసం వచ్చే కొందరు అధికారులు ప్రోటోకాల్‌కు మించి సౌకర్యాలు కోరుతున్నారని, దీంతో రాష్ట్ర ప్రభుత్వ శాఖలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సమాచారం. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు రాష్ట్రానికి వచ్చినప్పుడు వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక మర్యాదలు, వసతి, భద్రతా ఏర్పాట్లు కల్పించడం ఆనవాయితీ. ఇతర స్థాయి అధికారులు వచ్చినప్పుడు సంబంధిత శాఖలే తమ బడ్జెట్ పరిధిలో వసతి, రవాణా, ఇతర అవసరాలను సమకూరుస్తుంటాయి. అయితే ఇటీవల కొందరు అధికారులు విలాసవంతమైన హోటళ్లలో బస, ప్రత్యేక సూట్ గదులు, ఖరీదైన వాహనాలు వంటి సౌకర్యాలను కోరుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రముఖ హోటళ్ల నుంచి ప్రత్యేక భోజన ఏర్పాట్లు చేయాలని, పర్యటనల సమయంలో ఉన్నత స్థాయి వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పరిమిత బడ్జెట్‌తో పనిచేసే శాఖలు అదనపు వ్యయాన్ని భరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో కేంద్ర అధికారుల ప్రవర్తన కూడా చర్చనీయాంశంగా మారినట్లు సమాచారం. సత్కార కార్యక్రమాల్లో అందించిన బహుమతుల విషయంలోనూ, వాహనాల ఎంపికలోనూ కొందరు అధికారులు ప్రత్యేక అభిరుచులు వ్యక్తం చేయడంతో స్థానిక అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెబుతున్నారు. ముందుగా ఏర్పాటు చేసిన వాహనాలను తిరస్కరించి మరింత ఖరీదైన వాహనాలు కోరిన సందర్భాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర నిధులపై ఆధారపడే శాఖలు ఇలాంటి అంశాల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి వస్తోందని అధికార వర్గాలు అంటున్నాయి. సంబంధాలు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో చాలాసార్లు అదనపు ఖర్చులు భరించక తప్పడం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న బడ్జెట్‌తో పనిచేసే శాఖలకు ఇది మరింత భారంగా మారుతోందని పేర్కొంటున్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అభివృద్ధి కార్యక్రమాల విజయానికి కీలకమైనప్పటికీ, పర్యటనల సందర్భంగా ప్రోటోకాల్‌కు మించిన సదుపాయాల డిమాండ్లు పెరగడం రాష్ట్ర శాఖలపై ఆర్థిక, పరిపాలనా ఒత్తిడిని పెంచుతున్నట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# తెలంగాణకు కేంద్రం మరో బంపర్ గిఫ్ట్..

**మొదటిపేజీ తరువాయి**

రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (PPP - Public Private Partnership) పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే సౌకర్యం దక్కడంతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు పెద్ద ఉపశమనం లభించనుంది. మొత్తం 207.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ సరికొత్త రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటలతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుండి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), కాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త లైన్ పూర్తయితే మణుగూరురామగుండం మధ్య ఏకంగా 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీనివల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయి. మేడారం సమ్మక్కసారలమ్మ జాతరతో పాటు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వెనుకబడిన మారుమూల గిరిజన ప్రాంతాలకు ఒక పెద్ద వరంగా మారబోతోంది. దశాబ్దాలుగా రైలు ముఖం చూడని ఎన్నో గ్రామాలకు ఈ లైన్ ద్వారా రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో లభించే బొగ్గు (Coal), ఖనిజాలు, ఎరువులు , ఇతర పారిశ్రామిక సరుకు రవాణాకు (Freight Transport) ఈ రైల్వే లైన్ అత్యంత కీలకంగా మారనుంది. దీనివల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణా మరింత వేగవంతం కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ సరికొత్త ప్లాన్ సిద్ధం చేసింది. డీపీఆర్ (DPR) తయారీ, ల్యాండ్ అక్విజిషన్ (భూసేకరణ), వివిధ ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు తీసుకునే బాధ్యతలను రైల్వే శాఖ చూసుకుంటుంది. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణం , నిధుల సమీకరణ పనులను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థకు అప్పగిస్తారు. దీనికోసం రైల్వే శాఖ త్వరలోనే టెండర్లను ఆహ్వానించనుంది. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం.. మొదటి ఏడాదిలో పూర్తిగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత నాలుగు సంవత్సరాలలో అంటే మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ కొత్త రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.




# రేవంత్ ఫ్యూచర్ సిటీ

## కలల నగరమా? కాగితాల ప్రాజెక్టా?

రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు దాటింది. ఇక రేవంత్ రెడ్డికి ఉన్నది కేవలం రెండేళ్ల కాలం మాత్రమే. ఈ రెండేళ్లలో ఆయన అనుకున్న పనులు నెరవేరుస్తారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఈ రెండున్నరేళ్లలో గట్టిగా ఒక నిర్మాణాత్మక పనికూడా చేపట్టలేదు. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయాలేదు. ఎందుకంటే కేవలం సంక్షేమాలతో నెట్టుకు వస్తున్నారు. రేషన్ కార్డులు పెంచడం, సన్నబియ్యం ఇవ్వడం, రైతు భరోసా వేయడం వంటివన్నీ అభివృద్ధి కిందకు రావు. ఈ క్రమంలో ఆయన పెద్ద పనిని తలన పెట్టుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ. ఇప్పుడున్న హైదరాబాద్ ఇంతగా పెరగడానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మెల్లాగా ఇది అల్లుకుంటూ పోవడం వల్ల పెరిగందే తప్ప రాత్రికి రాత్రి పెరగలేదు. చంద్రబాబు సైబరాబాద్‌కు బీజం వేసినా, ఇవాళ ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించడానికి దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం పట్టింది. అందువల్ల ఒక సిటీని కట్టాలంటే అనుకున్నంత ఈజీగా అమాంతంగా కట్టలేం. అమరావతి కోసం నిధులు ఉండీ చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. మధ్యలో జగన్ మావిగన్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతి ఇప్పట్లో పూర్తి అయ్యేలా లేదు. పోలవరం కట్టడానికి దాదాపు 15 ఏళ్లు పట్టింది. నిధులు ఉండి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగవచ్చు. కానీ ఫ్యూచర్ సిటీ కోసం రూపాయి కూడా వెచ్చించడానికి లేదు. నిధుల లేమి రాష్ట్రాన్ని పట్టి పీడిస్తోంది. అక్కడ భూములు సేకరించి ఉన్నాయి కనుక ఫ్యూచర్ సిటీ కట్టేయలేం. కొన్ని కార్యాలయాలు తరలించినా, కొందరికి భూములు కేటాయించినా ఇది సాధ్యం అయ్యే పనికాదు. దీనికి తోడు కేవలం రెండంటే రెండేళ్ల కాలం మాత్రమే ఉంది. ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని కూడా చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే అక్కడ ఓ ఈవెంట్ నిర్వహించి, పెట్టుబడిదారులను ఆహ్వానించినా, అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎలా అడుగు వేస్తారో అధికారుకలకు కూడా అర్థం కాదు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ఎన్ని ఆదేశాలు జారీ చేసినా నిర్దిష్ట ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకొద్దామని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్-1 స్థాయి అధికారులను నియమించాలన్నారు. ఇవన్నీ బాగానే ఉన్నా, అక్కడ మౌలిక వసతులు, ముఖ్యంగా రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుంది. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా, అందుకు కేంద్రం త్వరగా నిధులు విడుదల చేయాల్సి ఉంది. 1500 ఎకరాల్లో డేటా సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఫ్యూచర్ సిటీ దేనికి ప్రాధాన్యం అన్నది కూడా ముఖ్యమే. ఇప్పటికిప్పుడు అక్కడికి వెళ్లి ఉండలేం. అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎవ్వరు కూడా ఉండలేరు. ఇది ఓరకంగా చెప్పాలంటే త్రిశంకు స్వర్గాన్ని సృష్టించడమే అవుతుంది. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బహుశా ఇదే ధీమాతో మరో పదేళ్లకు దీని గురించి ప్లాన్ వేసుకున్నారా అన్నది తెలియదు. ఒకవేళ సిఎం రేవంత్ రెడ్డిని ప్రజలు మరోమారు గెలిపించక పోతే ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ ఏంటన్నది ప్రశ్నార్థకం. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎవరు సిఎం అన్నది అప్పుడే నిర్ణయిస్తారు. ఒక్క వైఎస్ విషయంలో మాత్రమే రెండో ఆలోచన లేకుండా ఆయనను సిఎం చేశారు. అధిష్ఠానం ఎవరిని నిర్ణయిస్తే వారే ముఖ్యమంత్రి అని ప్రకటించడం కాంగ్రెస్ ఆనవాయితీ. దీనికి భిన్నంగా, వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడకపోవచ్చు. అయితే తనకు తాను ఇలా ప్రకటించుకున్నా, పరిస్థితులు మన చేతుల్లో లేవు. తమిళనాడు, కేరళ, బెంగాల్ పరిస్థితులు చూశాం. వచ్చే రెండేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. కొంతమంది మంత్రులు సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారన్న విమర్శ ఉంది. కాబట్టి నిర్మాణాత్మక వైఖరి అవసరం. అందుకు అనుగుణంగా కార్యాచారణ కావాలి. ప్రజల్లో ఇమేజ్ సంపాదించాలి. ఇవన్నీ చేసి, మళ్లీ అధికారంలోకి వస్తేనే ఫ్యూచర్ సిటీపై ప్రభావం ఉంటుంది. లేకుంటే ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో ఇది మనుగడలోకి రావడం ముమ్మాటికీ సాధ్యం కాకపోవచ్చు.

# లోన్ రికవరీ ఆడగాలకు కళ్లెం

- కొత్త నిబంధనలు ప్రతిపాదించిన ఆర్‌బీఐ
- కస్టమర్లను వేధించే చర్యలపై ఆంక్షలు




**న్యూఢిల్లీ, మే 21:** రుణాల వసూళ్ల పేరుతో కస్టమర్లను వేధించే బ్యాంకులు, రికవరీ ఏజెంట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కఠిన చర్యలకు సిద్ధమైంది. లోన్ రికవరీ ప్రక్రియలో అనుసరించాల్సిన నియమావళిపై కొత్త ముసాయిదా నిబంధనలను ఆర్‌బీఐ విడుదల చేసింది. 'కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటిటీస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్' పేరిట రూపొందించిన ఈ ముసాయిదాపై మే 31 వరకు ప్రజలు, వాటాదారుల అభిప్రాయాలను స్వీకరించనుంది. అక్టోబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. వ్యక్తిగత, కారు, గృహ రుణాల చెల్లింపుల్లో ఆలస్యం జరిగిన సందర్భాల్లో కస్టమర్ల మొబైల్ ఫోన్లను లాక్ చేయడం, ఫీచర్లను నిలిపివేయడం వంటి చర్యలకు ఆర్‌బీఐ అడ్డుకట్ట వేసింది. అయితే ఆ మొబైల్ లేదా టాబ్లెట్ కొనుగోలుకే బ్యాంకు రుణం ఇచ్చినట్లయితే మాత్రమే, అది కూడా 90 రోజుల గడువు దాటిన తర్వాతే పరిమిత చర్యలు తీసుకునే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. అలాగే ఫోన్ బ్లాక్ చేసినా ఇంటర్నెట్ సేవలు, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ అత్యవసర అలర్టులను నిలిపివేయరాదని పేర్కొంది. ఒకవేళ కస్టమర్ బకాయిలు చెల్లిస్తే గంటలోపే ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలని ఆదేశించింది. ఆలస్యం జరిగితే గంటకు రూ.250 చొప్పున బ్యాంకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. లోన్ రికవరీ కోసం బ్యాంకు సిబ్బంది లేదా రికవరీ ఏజెంట్లు చేసే కాల్స్, వాటి సమయాలు, ఉపయోగించిన నంబర్ల వివరాలను రికార్డ్ చేయాలని ఆర్‌బీఐ సూచించింది. ఆడియో, టెక్స్ట్ సంభాషణలను భద్రపరచాలని తెలిపింది. రుణగ్రహీతలతో అసభ్యంగా మాట్లాడటం, బెదిరింపులకు దిగడం, వ్యక్తిగత వివరాలు లేదా ఆడియో, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం వంటి చర్యలను పూర్తిగా నిషేధించింది. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా అవమానకర సందేశాలు పంపడం, పదేపదే కాల్స్ చేసి వేధించడం వంటి చర్యలపై కూడా కఠిన ఆంక్షలు విధించనుంది. రుణాల వసూళ్ల ప్రక్రియలో పారదర్శకత, వినియోగదారుల గౌరవం కాపాడడమే ఈ కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశమని ఆర్‌బీఐ పేర్కొంది.

# ఎబోలా వైరస్ విజృంభణ

### ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా

### ఎయిర్‌పోర్ట్‌లో అడ్వయిజరీ జారీ

**న్యూఢిల్లీ, మే 21:** ఆఫ్రికాలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ పరిణామాల నడుమ దిల్లీ వేదికగా ఈ నెల 28-31 తేదీల మధ్య జరగాల్సిన 'ఇండియా- ఆఫ్రికా ఫోరమ్ సమిట్' వాయిదా పడింది. భారత్, ఆఫ్రికన్ యూనియన్ కలిసి ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. కొత్త తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేస్తామని తెలిపింది. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్రికా సీడీసీ, సంబంధిత సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు.. ఎబోలా వైరస్ వ్యవహారంలో దిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, నీరసం, కండరాల నొప్పులు తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్టు వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎబోలా కారణంగా ఇప్పటివరకు 139 మంది మృతి చెందారు. దాదాపు 600 అనుమానిత కేసులను గుర్తించారు. కాంగోలో వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనేందుకు తమకు మరింత సామగ్రి, సిబ్బంది అవసరమని అధికార వర్గాలు, సహాయక బృందాలు కోరాయి. మొదటి మరణం నమోదైన బునియా ప్రాంతానికి దాదాపు 20 టన్నుల సహాయ సామగ్రిని తరలించినప్పటికీ.. ఐసొలేషన్ గదుల కొరత కారణంగా వైద్యులు సాధారణ వార్డుల్లోనే ఎబోలా అనుమానిత రోగులకు చికిత్స అందిస్తున్నారు.

### ముందు జాగ్రత్తలు ప్రకటించిన కేంద్రం

ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎబోలా వైరస్ నివారణకు అవసరమైన ముందుజాగ్రత్తలు, ఆరోగ్య సన్నాహాలు, అత్యవసర స్పందన చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం భారతదేశంలో ఎలాంటి ఎబోలా కేసులు నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవుల్లో నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల స్క్రీనింగ్, అనుమానితులను క్వారంటైన్‌లో ఉంచడం, ప్రత్యేక పరీక్షా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై రాష్ట్రాలకు వివరణాత్మక మార్గదర్శకాలు పంపింది. అదేవిధంగా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించింది. గతంలో అంటువ్యాధుల సమయంలో అమలు చేసిన విధానాలను మళ్లీ కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది.





# పుల్వామా ఉగ్రదాడి సూత్రధారి హతం

### ఆక్రమిత కాశ్మీర్‌లో దుండగుల చేతిలో హతం

**న్యూఢిల్లీ, మే 21:** 2019 పుల్వామా ఉగ్రదాడికి కీలక సూత్రధారిగా భావిస్తున్న హమ్జా బుర్హాన్ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో హతమైనట్లు సమాచారం. ముజఫరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో అతడు మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు మరణించారు .పుల్వామా దాడికి పాకిస్థాన్‌కు చెందిన జైష్-ఎ-మహ్మద్ ఉగ్రసంస్థ బాధ్యత వహించింది. జైష్-ఎ-మహ్మద్ సంస్థకు అనుబంధంగా పని చేసిన హమ్జా బుర్హాన్ పుల్వామా దాడి ప్రణాళికలో కీలక పాత్ర పోషించాడని భారత దర్యాప్తు సంస్థలు అనుమానించాయి. తాజాగా అతడు గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో హతమవడం సంచలనంగా మారింది . ఇటీవల పాకిస్థాన్‌లో భారత వ్యతిరేక ఉగ్రవాదులు వరుసగా గుర్తు తెలియని వ్యక్తుల దాడుల్లో హతమవుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. గతంలో పఠాన్‌కోట్, సంజ్వాన్, కాందహార్ హైజాక్ వంటి ఘటనలతో సంబంధం ఉన్న పలువురు ఉగ్రవాదులు కూడా ఇదే తరహాలో మృతి చెందారు. కాగా, హమ్జా బుర్హాన్ హత్య వెనుక ఎవరు ఉన్నారో కనిపెట్టేందుకు స్థానిక అధికారులు దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

## పశ్చిమాసియా సంక్షోభ ప్రభావాలపై

# కేంద్ర కేబినెట్ కీలక చర్చ

### 11 నెలల తర్వాత మోదీ అధ్యక్షతన కీలక సమావేశం

### చమురు ధరలు, ఆర్థిక ప్రభావాలపై సమీక్ష




**ఢిల్లీ, మే 21:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం సాయంత్రం కేంద్ర మంత్రిమండలి కీలక సమావేశం జరిగింది. దాదాపు 11 నెలల తర్వాత నిర్వహించిన ఈ కేబినెట్ సమావేశంలో దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. జూన్ 9న మోదీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రధానంగా దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా ప్రజలకు చేరుతున్న సేవలు, వివిధ పథకాల అమలు స్థితి, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ప్రభావంపై మంత్రులతో ప్రధాని మోదీ మాట్లాడుతున్నారు. అలాగే దేశవ్యాప్తంగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై కూడా సమీక్షించనున్నారు. రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు వంటి కీలక ప్రాజెక్టుల అమలు వేగం, పెట్టుబడుల పరిస్థితి, భవిష్యత్తు కార్యాచరణపై మంత్రివర్గంతో ప్రధాని చర్చించనున్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలకు దారితీస్తున్న పశ్చిమాసియా సంక్షోభంపై కూడా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలోని పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావం, చమురు ధరల మార్పులు, వాణిజ్యంపై పడే ప్రభావం వంటి అంశాలను ప్రధాని మోదీ సమీక్షిస్తున్నారు. వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, తీసుకున్న నిర్ణయాలు, రాబోయే రోజుల కార్యాచరణపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రులు తమ శాఖలకు సంబంధించిన పురోగతి నివేదికలను ప్రధాని ముందు ఉంచినట్లు సమాచారం. ఈ సమావేశంలో భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు, పెట్టుబడుల ప్రోత్సాహం, ఆర్థిక వృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మరింత సమర్థవంతమైన అమలుపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

# భద్రతా మండలిలో మరోమారు పాక్ దుర్నీతి

### గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి

### నరమేధం చేసే పాక్‌కు మాట్లాడే హక్కులేదని విమర్శలు



**న్యూఢిల్లీ, మే 21:** అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భం గా పాక్ ప్రతినిధి జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్ పై పాక్ జరిపిన దాడుల గురించి హరీష్ ప్రస్తావించారు. పవిత్ర రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. ఈ అమానుషమైన హింసాకాండలో 269 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 122 మంది గాయపడినట్లు తెలిపారు. 'చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ.. అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం' అని విమర్శించారు. తన సొంత ప్రజల పైనే బాంబులు వేస్తూ, జాతి నిర్మూలనకు పాల్పడే దేశం ఇలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడటంలో పెద్ద ఆశ్చర్యం కలిగించే విషయం కాదన్నారు.

# అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రూ.4.02 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- తెల్దారుపల్లిలో రూ.9 కోట్లతో ప్రగతి పనులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఏదులాపురం మున్సిపాలిటీ ప్రజల సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ 14వ వార్డు పరిధిలోని తెల్దారుపల్లి నుంచి రాముడు చెరువు మీదుగా ఖమ్మం–కోదాడ రహదారి వరకు రూ.4.02 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 3.6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెల్దారుపల్లి ప్రాంతంలో ఇప్పటికే రూ.9 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, తాజా రోడ్డు నిర్మాణంతో స్థానికులకు రవాణా ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల హామీలన్నింటినీ ప్రభుత్వం క్రమ పద్ధతిలో నెరవేరుస్తోందని.. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

**త్వరలోనే కొత్త ఆసరా పింఛన్లు..**

రాబోయే మంత్రివర్గ సమావేశంలో కొత్త ఆసరా పింఛన్ల మంజూరుపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి వెల్లడించారు. నిరుద్యోగ యువతకు ఇప్పటికే 72 వేల ఉద్యోగాలు కల్పించామని, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడంతో పాటు సన్నధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నామని వివరించారు. గురుకుల విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తుచేశారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తి

**ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ ఆశయాలు యువత స్ఫూర్తి గా తీసుకొని ముందుకెళ్లాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వం జనరల్ హాస్పిటల్ లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, యూత్ టౌన్ అధ్యక్షుడు బొడ్డు సాయి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పండ్ల పంపిణీ కార్యక్రమానికి ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, యువత సాధికారత కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ పునాది వేశారని కొనియాడారు. యువత కాంగ్రెస్ నాయకులు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు.అనంతరం ఆసుపత్రిలోని రోగులకు, వారి సహాయకులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, శ్రీ దండు మైసమ్మ దేవాలయం చైర్మన్ తంగెళ్ల కర్ణాకర్ రెడ్డి, కౌన్సిలర్స్ కొండపల్లి దిలీప్ రెడ్డి, సునీల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహీం, అబ్బాస్, మద్దేబోయిన శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయిన వారి పేరు మిద రేషన్.. అధికారులు కళ్లుండి కబోదులా?

**నేలకొండపల్లి మండలంలో డీలర్ల తీరుపై ప్రజల ఆగ్రహం**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలో గ్రామలలో చనిపోయిన వారి పేర్లు రేషన్ కార్డుల్లో కొనసాగుతూనే నెలనెలా రేషన్ డ్రా అవుతున్నాయని నేలకొండపల్లి మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు కళ్లుండి కబోదుల్లా చూస్తున్నారని మండిపడుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో ఏళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లు ఇంకా కార్డుల్లోనే ఉన్నాయని స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. "కొంతమంది రేషన్ డీలర్లు తెలిసిన వాళ్లు చనిపోతే వెంటనే పేర్లు డిలీట్ చేస్తున్నారు. మరికొందరి పేర్లను మాత్రం కావాలనే అలాగే ఉంచుతున్నారు" అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ గ్రామస్తుడు తెలిపాడు. చనిపోయిన వారి పేరుతో వస్తున్న రేషన్ ఎటు పోతున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "డీలర్ల చేతివాటం లేకుండా ఇది జరిగే పని కాదు. కొందరు డీలర్లు దీన్ని బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు" అని ఆరోపణలు వినిపిస్తున్నాయి.రేషన్ అధికారులు వెంటనే మండలంలోని అన్ని గ్రామాల్లో కార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. చనిపోయిన వారి పేర్లను వెంటనే తొలగించి, తప్పు చేసిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. "గ్రామసభ పెట్టి కార్డులు వెరిఫై చేస్తే అన్ని బండారం బయటపడుతుంది" అని యువకులు అంటున్నారు.ఈ విషయంపై మండల ఎం ఆర్ ఓ అధికారిని వివరణ కోరగా, "ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే. గ్రామాల వారీగా విచారణ చేపడతాం. చనిపోయిన వారి పేర్లు ఉంటే వెంటనే తొలగిస్తాం. డీలర్ల తప్పు తేలితే లైసెన్సులు రద్దు చేస్తాం" అని తెలిపారు

## సబ్ సెంటర్ ను పరిశీలించిన డాక్టర్ సురేష్



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** మెడికల్ ఆఫీసర్ డా. ఎం. సురేష్ అడ్లూర్ ఎల్లారెడ్డి సబ్‌సెంటర్‌ను గురువారం సందర్శించారు అన్ని ఆరోగ్య ప్యారా మీటర్స్ పైన సమీక్ష నిర్వహించారు. విధుల టైమ్‌టేబుల్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. హైపర్‌టెన్షన్, మధుమేహం, కేసుల స్క్రీనింగ్ 100% పూర్తి చేయాలని ఆదేశించారు. వేడి కారణంగా వచ్చే అనారోగ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహింరు,ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్స్, ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు అధికారుల నెలవారి సమీక్షా సమావేశం

- ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి.
- కేసుల దర్యాప్తులో నైపుణ్యం తో పని పని చేయాలి
- అక్రమ రవాణా, అసాంఘిక చర్యల పై పటిష్ట నిఘా.
- ప్రజల భద్రత కోసమే నిత్యం తనిఖీ.
- కె. నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా..




**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ జిల్లా పోలీసు కార్యాలయం జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ పోలీసు అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల దర్యాప్తులో నైపుణ్యంతో పనిచేయాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీసు సేవలను వేగంగా అందించాలని కోరారు. కేసులు పెండింగ్ లేకుండా పనిచేయాలని తెలిపారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల పై పటిష్ట నిఘా ఉంచి నివారించాలని ఆదేశించారు. బాధితుల ఇంటి వద్ద నుండి కేసు నమోదు చేసే విషయంలో అలసత్వం వహించకూడదని డోర్ స్టెప్ ఎఫ్పైర్ పటిష్టంగా అమలుకోవాలని సూచించారు. సమీక్ష లో భాగంగా నేరాల నమోదు, పెండింగ్ కేసులు, కోర్టు మానిటరింగ్, శిక్షలు అమలు, డయల్ 100 కాల్స్, బాధితుల ఇంటి వద్ద నుండి కేసు నమోదు, ప్రజా ఫిర్యాదుల పై స్పందన, వాహనాల తనిఖీ, అనుమానిత వ్యక్తుల కదలికలు, రౌడి షిటర్స్ పై నిఘా, రోడ్డు ప్రమాదాల నిర్మూలన, సైబర్ మోసాల్లో నగదు రిఫండ్, దొంగతనాల కేసుల్లో కేసుల డిటెక్షన్ మొదలగు అంశాలను సమీక్షించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. సైబర్ మోసాలపై, మహిళా భద్రతపై అవగాహన కల్పించాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, అక్రమ రవాణా నివారణకు నిత్యం తనిఖీలు చేయాలి అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట డీస్పీ ప్రసన్నకుమార్, డీసీర్బ్ డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డీసీర్బ్ ఇన్స్పెక్టర్ మాగ్దూమ్ అలి, సీఐ లు వెంకటయ్య, రాజశేఖర్, నాగేశ్వరరావు,రామకృష్ణా రెడ్డి, శివ శంకర్,చరమందరాజు, ఎస్ ఐ లు, సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా పెద్దమ్మ జాతర ఉత్సవాలు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఉప్పల్ వాయి గ్రామంలో పెద్దమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా పూజారులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు ముదిరాజ్ సంఘ సభ్యులు బోనాలు ఊరేగింపు చేశారు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు, రాత్రి మిద్దె రామ గౌడ్ శిష్యులతో పెద్దమ్మ దేవి ఒగ్గు కథ చెప్పి భక్తులను అలరింప చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూమి రిజిస్ట్రేషన్ పేరుతో రూ.10 లక్షల మోసం

**బీజేపీ నేతపై కేసు నమోదు.. అట్రాసిటీ బెదిరింపులతో బాధితుల ఆవేదన**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** రాజకీయ పలుకుబడి ఉందని నమ్మించి, భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి ఒక రైతు వద్ద రూ.10 లక్షలు వసూలు చేసి మోసం చేసిన ఘటన ఖమ్మం జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడి ఫిర్యాదుతో తిరుమలాయపాలెం పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

**అసలు ఘటన:**

గొల్లగూడెం గ్రామానికి చెందిన ఏ. శ్రీనివాసరావుకు ఖమ్మం శ్రీనివాస్ నగర్ సమీపంలో ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ఆయనకు, మిత్రుడు మేడి మనోహర్ ద్వారా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామ నివాసి, బీజేపీ ప్రధాన కార్యదర్శి నల్లగట్టు ప్రవీణ్‌తో పరిచయం ఏర్పడింది. "నాకు పెద్ద నాయకులతో సంబంధాలు ఉన్నాయి. మీ భూమి రిజిస్ట్రేషన్ బాధ్యత నాది" అని నమ్మించిన ప్రవీణ్, రిజిస్ట్రేషన్ ఖర్చుల పేరుతో శ్రీనివాసరావు వద్ద నుంచి పలు దఫాలుగా రూ.10 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు లేకపోవడంతో శ్రీనివాసరావు తన స్నేహితుడు మనోహర్ వద్ద అప్పు చేసి మరీ ఇచ్చాడు.

**రెండేళ్లయినా ఫైలు కదలలేదు:**

డబ్బులు ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచినా రిజిస్ట్రేషన్ ఫైలు కదలలేదు. మోసపోయామని గ్రహించిన శ్రీనివాసరావు డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రవీణ్‌ను అడిగారు. దీంతో ప్రవీణ్ బెదిరింపులకు దిగాడు. "నేను ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవాడిని. నాతో పెట్టుకుంటే మీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి జైలుకు పంపుతా" అని బాధితులను తీవ్రంగా బెదిరించాడని శ్రీనివాసరావు తెలిపారు.

**పోలీస్ కేసు నమోదు:**

డబ్బులు పోగొట్టుకొని, అక్రమ కేసుల బెదిరింపులతో మానసిక వేదనకు గురైన బాధిత కుటుంబం బుధవారం తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కూచిపూడి జగదీష్ స్పందించి నిందితుడు నల్లగట్టు ప్రవీణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**మీడియా ముందు బాధితుల ఆవేదన:**

గురువారం తిరుమలాయపాలెంలో విలేకరుల సమావేశంలో బాధితులు శ్రీనివాసరావు, మేడి మనోహర్ తమ గోడు వెళ్లబోసుకున్నారు. "కష్టపడి తెచ్చిన డబ్బును నమ్మించి దోచుకోవడమే కాకుండా, అట్రాసిటీ చట్టాన్ని అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులు పెడతానని బెదిరించడం ఎంతవరకు న్యాయం" అని వారు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, పోగొట్టుకున్న రూ.10 లక్షలు తిరిగి ఇప్పించాలని కన్నీటి పర్యంతమయ్యారు.

## కొనుగోలు కేంద్రాల్లో దోపిడీని అరికట్టాలి

**బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** వరి,మొక్కజొన్నను త్వరితగతిన కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం తహసిల్దార్ పి.రామ్ ప్రసాద్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న తీవ్ర జాప్యం వల్ల కాంటాలు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు.దీనికి తోడు కేంద్రాల్లో మౌలిక వసతుల లేమితో పాటుగా తేమ పేరుతో తరుగు తీస్తున్నారని అన్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేసి, తరుగు పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని వినతిలో కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు పుట్టా సత్యనారాయణ,నాయకులు సయ్యద్ మోహినుద్దీన్,కందరబోయిన గోపి,తదితరులు పాల్గొన్నారు.

## మంథని పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు..

### మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్..



**రాజముద్ర న్యూస్, మంథని, మే 21:** మంథని మున్సిపల్ పరిధిలోని పలువార్డుల్లో నీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ తెలిపారు. గురువారం మంథని మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో గాంధీ చౌక్ గణేష్ ఉత్సవ సమితి వద్ద ఏర్పాటు చేసిన బోర్వెల్ ను మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహిందర్ రెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని వార్డుల్లో నూతనంగా బోర్వెల్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. అదేవిధంగా పట్టణంలోని ప్రజలు నీటి సమస్యను అధిగమించే విధంగా మునిసిపల్ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని ప్రజలు తమ ప్రాంతంలో ఉన్న నీటి సమస్యను మున్సిపల్ పాలకవర్గం దృష్టికి తీసుకురావాలని కోరారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రధాన ప్రాంతాల్లో చలివేంద్రాలను, మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలికైన గాంధీ చౌక్ ప్రాంతాన్ని ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన వాగ్దానం మేరకు సుందరీ కరణ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని దీనికోసం ప్రణాళికలను తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ను గాంధీ చౌక్ గణేష్ ఉత్సవ సమితి పక్షాన సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు కోమురోజు చంద్రమోహన్, సలహాదారుడు కొమురోజు మారుతి, సభ్యులు కొమ్ము రోజు శ్రీనివాస్, సిరిపురం రమేష్, గుడిమల్ల కుమార్, ఓల్లల అశోక్, కొమురోజు మధుకర్,లింగం నారాయణ, కొమురోజు సుమన్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ తోట రాజలింగం, కాంగ్రెస్ నాయకుడు జంబోజు సమ్మయ్య,కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకుడు గోటి కార్ కిషన్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

### తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను శాలువాతో సత్కరించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్



**రాజముద్ర న్యూస్, కాళేశ్వరం, మే 21:** మహాదేవపూర్ మండలం కాళేశ్వరం లో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పుష్కరాల తొలి రోజు సందర్భంగా కాళేశ్వర త్రివేణి సంగమ క్షేత్రానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎల్లే రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, సర్పంచ్ వనం రామచంద్రరావు, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య , ఎరుకల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని సన్మానించిన విద్యార్థి నాయకుడు డిగంబర్



**రాజముద్ర న్యూస్, మంథని, మే 21:** మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు గా ఎన్నికైన కొడారి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహవాది సతీష్ కుమార్ ను గురువారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ లో మంథని విద్యార్థి నాయకుడు డిగంబర్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికలు సమాజంలో కీలకమైన పాత్ర వహిస్తాయని,ప్రజా సమస్యలను ప్రభుత్వాలకు, అధికారులను చేరవేయడంలో మీడియా ఫోర్త్ స్టేట్ గా పనిచేస్తుందన్నారు. డివిజన్ ప్రెస్ క్లబ్ రిపోర్టర్ లు ప్రజా సమస్యలపై స్పందిస్తూ,సమస్యల పరిష్కారంలో చొరువా చూపుతోందని కొనియాడారు. ఈ సందర్భంగా పాత్రికేయులు కాసర్ల శంకర్, ఏగోలపు సంతోష్ గౌడ్, మాదేశి శ్రావణ్ కుమార్, నాంపల్లి శ్రీనివాస్ లను సన్మానించారు.

# బూత్ లెవల్ ఏజెంట్లు పారదర్శకంగా వ్యవరించాలి

*** మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి**



**నాగారం, రాజముద్ర న్యూస్:** ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ లో నాగారం బిజెపి అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి హాజరైనారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తిగా పారదర్శకంగా, క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. తమ ప్రాంతాల్లో అసలు ఓటర్లు ఎవరు, నకిలీ ఓటర్లు ఎవరు అనే విషయంపై పూర్తి అవగాహనతో బూత్ లెవల్ అధికారులకు బిఎల్ ఓ సమాచారం అందించాలని తెలిపారు. నకిలీ ఓట్ల తొలగింపుపై ప్రతి నాయకుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే అక్రమ చొరబాటుదారులు, రోహింగ్యాల అంశంపై నాయకులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి నాయకుడు నెలరోజుల పాటు తమ బూత్ స్థాయిలో పనిచేసి ఓటర్ జాబితాను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. తమ ప్రాంతంలో నకిలీ ఓటరును త్వరగా గుర్తుపట్టే అవకాశం ఉంటుందని, ఎందుకంటే స్థానికంగా మనం ఉంటాం కాబట్టి దాంట్లో భాగంగా ఒక శరణార్థి,అక్రమ ఓటర్ ఎన్ని సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడో ఈ విషయాన్ని బిఎల్ ఓ లకు తెలియజేయాలని, దాని ద్వారా అక్రమ ఓటర్లను తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. దేశ భద్రత, దేశ సమగ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రతి ఒక్క నాయకుడు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సమగ్రమైన ఓటర్ జాబితా తయారీలో సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ దేశ భద్రత,దేశ సమగ్రత కోసం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మునిగంటి సురేష్, బొమ్మిడి బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ తరుగోప్పుల బలరాం మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్,రాష్ట్ర మహిళా మోర్చా ఆఫీస్ కార్యదర్శి సంతోషి, మాజీ అధ్యక్షులు బుధవరం వేణుగోపాల్ , ప్రధాన కార్యదర్శి ఏనుగు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వల్లల శ్రీనివాస్ గౌడ్, ఎలసాని నాగరాజు యాదవ్ కార్యదర్శి సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు శశాంక్ శర్మ ,సూర్య శేఖర్ రెడ్డి, జూపల్లి నరేష్, వినయ్ రెడ్డి, సూర్వి రాజు, సతీష్, శంకర్ ముదిరాజ్, అశోక్ చారి,మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగారం-రాంపల్లిలోని కాలనీల అభివృద్ధే ఏకైక లక్ష్యం

**నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు కె.జీవన్ రెడ్డి**





**నాగారం, రాజముద్ర న్యూస్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగరం,రాంపల్లి లో గురువారం విజయపురి కాలనీ, ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అత్యవసర సమావేశంలో కాలనీల అభివృద్ధి గురించి పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయాల మేరకు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం నాగారం,రాంపల్లి ప్రాంతంలో విజయపురి, హరితపురి, శివశక్తి సాయి, సింహపురి, విష్ణుపురి, భాగ్యనగర్, బాపూజీనగర్, వెంకటేశ్వర కాలనీల ప్రజా సమస్యలపై చర్చించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సమిష్టిగా నిర్ణయించారు. ఈ సమావేశంలో ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కె.జీవన్ రెడ్డి, అధ్యక్షులు వేణుగోపాల్, సాయినాథ్ గౌడ్, దేవివర ప్రసాద్ లు పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరూ ముక్త కంఠంతో ఐక్యంగా కలిసి పనిచేయాలని సమావేశంలో తీర్మానం చేసినారు.

# చేపల చెరువులో చికెన్ వ్యర్థాలు..

- డ్రైవర్, లీజుదారుపై కేసు
- కోరుట్ల గూడెం సర్పంచ్ ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలను వేయడంతో జల కాలుష్యం జరుగుతోందని, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారనే ఫిర్యాదు మేరకు నేలకోండపల్లి మండలం కోరుట్ల గూడెం గ్రామ శివారులోని చేపల చెరువు లీజుదారు, బొలెరో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు కోరుట్ల గూడెం గ్రామ సర్పంచ్ కొత్తపల్లి త్రివేణి ఇచ్చిన దరఖాస్తు మేరకు గ్రామ శివారులో 14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చేపల చెరువులో చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలను వేస్తున్నట్లు తెలిసింది. దీనివల్ల జల కాలుష్యం ఏర్పడి పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ రాత్రి సమయంలో కోడి వ్యర్థాలను బొలెరో వాహనంలో తరలిస్తుండగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. సర్పంచ్ ఫిర్యాదు ఆధారంగా బొలెరో నడిపిన డ్రైవర్‌పై, చేపల చెరువును లీజుకు తీసుకున్న యజమానిపై ఈరోజు కేసు నమోదు చేశామని నేలకోండపల్లీ ఎస్ఐ పి సంతోష్ తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందన్నారు. చెరువులో చికెన్ వ్యర్థాలు వేయడం వల్ల నీరు కలుషితమై దుర్వాసన వస్తోందని, భూగర్భ జలాలు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు



# నేడే చలో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్

- డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధిద్దాం..
- తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు



**జవహర్ నగర్, రాజముద్ర న్యూస్:** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పరిశీలించడానికి రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి విచ్చేయనున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం,వైఫల్యాల కారణంగా జవహర్ నగర్ ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డంపింగ్ యార్డ్ వల్ల కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యం,జీవన విధానం ప్రమాదంలో పడింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా కోరుతున్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని పలువురు ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు కలవడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించి డంపింగ్ యార్డ్ సమస్యపై సమగ్రంగా చర్చించారు. అనంతరం తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మాట్లాడుతూ.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు వలన ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుండటంపై ముఖ్యమంత్రి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. జవహర్ నగర్ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి, పరిశీలించడానికి విచ్చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు మద్దతుగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు,యువత,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేస్తున్నాము. జవహర్ నగర్ ప్రజల ఆరోగ్యం – మన అందరి బాధ్యత, డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధిద్దాం.



# హార్దిక్ పాండ్యకు భారీ షాక్

**కొల్‌కతా, మే 21 :** ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యకు ఐపీఎల్ క్రమశిక్షణ కమిటీ భారీ షాక్ ఇచ్చింది. తాజాగా కొల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడిపై జరిమానా విధించారు. హార్దిక్ మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా నమోదు చేశారు. మ్యాచ్ సందర్భంగా పది ఓవర్లు పూర్తైన తర్వాత నాలుగో బంతి వేసిన అనంతరం హార్దిక్ తీవ్ర అసహనానికి లోనైనట్లు తెలుస్తోంది. మైదానంలో తిరిగి వెళ్తున్న సమయంలో కోపంతో వికెట్లను కాలితో బలంగా తన్ని కింద పడేశాడు. క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ఉద్దేశపూర్వకంగా వికెట్లను ధ్వంసం చేసినందుకే ఐపీఎల్ నిర్వాహకులు ఈ చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం మైదానంలోని క్రీడా సామగ్రిని లేదా వికెట్లను దుర్వినియోగం చేయడం నిషేధితం. ఒక జట్టు కెప్టెన్‌గా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన హార్దిక్ ఇలా ప్రవర్తించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇప్పటికే ఈ సీజన్‌లో ఫామ్ లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముంబై ఇండియన్స్ జట్టుకు ఈ ఘటన మరింత ప్రతికూలంగా మారింది. ఐపీఎల్ క్రమశిక్షణ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయం ఇతర ఆటగాళ్లకు కూడా హెచ్చరికగా నిలుస్తుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# కావ్య మారన్ పెళ్లి పుకార్లు వైరల్

**చెన్నై, మే 21:** సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పెళ్లి వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఏడాది చివర్లో వీరిద్దరూ వివాహం చేసుకోబోతున్నారంటూ తమిళ సినీ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య ప్రేమ కొనసాగుతోందని, త్వరలోనే ఇరు కుటుంబాల నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. గత ఏడాది జూన్ నుంచి వీరి రిలేషన్‌షిప్‌పై ఎక్స్, రెడ్డిట్ వంటి సామాజిక మాధ్యమాల్లో అనేక కథనాలు వెలువడ్డాయి. విదేశాల్లో కలిసి కనిపించారంటూ కొన్ని ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. అలాగే సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న పలు భారీ చిత్రాలకు అనిరుధ్ సంగీతం అందిస్తుండటంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. ఇటీవల ఈ వివాహ సంబంధం కోసం సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా రంగంలోకి దిగినట్లు తమిళ మీడియాలో ఊహాగానాలు వినిపించాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇటీవల ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పెళ్లి గురించి ప్రశ్నించగా అనిరుధ్ చిరునవ్వుతో స్పందిస్తూ ఆ ప్రశ్నను దాటవేశారు. గతంలో కూడా తన పెళ్లిపై వస్తున్న పుకార్లను ఖండిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ప్రస్తుతం అనిరుధ్ భారీ సినిమాలతో బిజీగా ఉన్నారు. మరోవైపు కావ్య మారన్ ఐపీఎల్‌తో పాటు దక్షిణాఫ్రికా టీ20 లీగ్ వ్యవహారాల్లో నిమగ్నమై బిజినెస్ ఉమెన్‌గా బిజీ షెడ్యూల్ కొనసాగిస్తున్నారు.

# సింధు ధరించిన ఆ పరికరం ఏంటి?



**హైదరాబాద్, మే 21 :** క్రీడా రంగంలో సాంకేతికత వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా క్రికెట్‌లో ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుండగా.. ఇప్పుడు ఇతర క్రీడల్లో కూడా ఆధునిక టెక్నాలజీ అడుగుపెడుతోంది. తాజాగా భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ధరించిన ఓ ప్రత్యేక పరికరం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల పలు బ్యాడ్మింటన్ టోర్నీల్లోనూ, బెంగళూరులో జరిగిన ఓ క్రీడా కార్యక్రమంలో విరాట్ కోహ్లీని కలిసిన సమయంలోనూ సింధు తన కణత వద్ద ఓ చిన్న పరికరం ధరించి కనిపించింది. దీంతో అది ఏమిటన్న చర్చ సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. ఆ పరికరం పేరు 'టెంపుల్'. ఇది కృత్రిమ మేధస్సుతో పనిచేసే ఆధునిక చిప్. అథ్లెట్ల మెదడులో రక్తప్రసరణ ఎలా జరుగుతోందో ఈ పరికరం విశ్లేషిస్తుంది. అలాగే ఆటగాళ్ల మానసిక పరిస్థితి, ఒత్తిడి స్థాయి, ఏకాగ్రత వంటి అంశాలపై కీలక సమాచారాన్ని అందిస్తుంది. ఈ డేటా ఆధారంగా కోచ్‌లు ఆటగాళ్ల శిక్షణ విధానాల్లో మార్పులు చేయడానికి, ఒత్తిడి నియంత్రణకు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. క్రీడాకారుల ప్రదర్శనను మెరుగుపరచడంలో ఈ పరికరం కీలకంగా మారే అవకాశముందని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. ఈ సరికొత్త టెక్నాలజీని ప్రముఖ ఆహార సరఫరా సంస్థ జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయెల్ అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఇది ప్రయోగాత్మక దశలో ఉండగా.. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే అథ్లెట్లకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి.

# చెన్నైపై గుజరాత్ గర్జన!

- చెన్నై సూపర్ కింగ్స్‌పై 89 పరుగుల తేడాతో ఘన విజయం
- సాయి సుదర్శన్, గిల్, బట్లర్ విధ్వంసకర బ్యాటింగ్
- 140 పరుగులకే కుప్పకూలిన చెన్నై బ్యాటింగ్ లైనప్
- బౌలింగ్ లో సత్తా చాటిన రషీద్, సిరాజ్, రబాడ







**ఐపీఎల్ టోర్నీలో గుజరాత్ టైటాన్స్ సొంత గడ్డపై సింహంలా గర్జించింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ను చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ సమష్టిగా సత్తా చాటిన గుజరాత్ 89 పరుగుల భారీ తేడాతో అద్భుత విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ఈ భారీ విజయంతో గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్ స్థానాన్ని మరింత పదిలం చేసుకోగా.. ఘోర పరాజయంతో చెన్నై ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.**

**అహ్మదాబాద్:** నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా గురువారం జరిగిన ఈ కీలక మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు ఆది నుంచే చెలరేగి ఆడారు. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి గుజరాత్ ఏకంగా 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ బ్యాటర్లలో సాయి సుదర్శన్ 53 బంతుల్లో 84 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలవగా, శుభ్‌మన్ గిల్ 37 బంతుల్లో 64 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖర్లో జోస్ బట్లర్ 27 బంతుల్లోనే 57 పరుగులు చేసి అజేయంగా నిలిచి చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. భారీ స్కోరును కట్టడి చేయడంలో చెన్నై బౌలర్లు తీవ్రంగా విఫలమయ్యారు. ముఖేష్ చౌదరి 4 ఓవర్లలో 36 పరుగులిచ్చి ఒక వికెట్, స్పెన్సర్ జాన్సన్ 4 ఓవర్లలో 47 పరుగులిచ్చి ఒక వికెట్, అన్షుల్ కంబోజ్ 4 ఓవర్లలో 56 పరుగులిచ్చి ఒక వికెట్ తీశారు.

## పట్టు నిలుపుకోలేకపోయిన చెన్నై..

230 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు గుజరాత్ బౌలర్ల ధాటికి చేతులెత్తేశారు. వరుస వికెట్లు కోల్పోతూ కేవలం 13.4 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలిపోయారు. చెన్నై బ్యాటర్లలో శివమ్ దూబే 17 బంతుల్లో 47 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. మ్యాట్ షార్ట్ 14 బంతుల్లో 24 పరుగులు, అన్షుల్ కంబోజ్ 8 బంతుల్లో 19 పరుగులు చేసి కాస్త ప్రతిఘటించే ప్రయత్నం చేశారు. మిగతా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. దీంతో చెన్నైకి 89 పరుగుల భారీ ఓటమి తప్పలేదు.

## చెలరేగిన గుజరాత్ బౌలర్లు..

భారీ లక్ష్య ఛేదనలో ఉన్న చెన్నైని గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ తో దెబ్బకొట్టారు. చెన్నై బ్యాటింగ్ లైనప్ ను పేకమేడలా కూల్చారు. రషీద్ ఖాన్ కేవలం 2 ఓవర్లలో 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ సిరాజ్ 3 ఓవర్లలో 26 పరుగులిచ్చి 3 వికెట్లు, కగిసో రబాడ 3.4 ఓవర్లలో 32 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి చెన్నై పతనాన్ని శాసించారు. ఈ భారీ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో తన అగ్ర స్థానాన్ని మరింత మెరుగుపరచుకుంది. భారీ తేడాతో గెలవడం వల్ల ఆ జట్టు నెట్ రన్ రేట్ సైతం అమాంతం పెరిగింది. మరోవైపు ఈ ఘోర పరాజయంతో పాయింట్ల పట్టికలో వెనుకబడి ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు దాదాపు మూసుకుపోయాయి.



# ధోనీ లేకుండానే సీఎస్కే చివరి పోరు

**అహ్మదాబాద్, మే 21:** ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ అంటే ముందుగా గుర్తొచ్చే పేరు మహేంద్రసింగ్ ధోనీ. ఎన్నో ఏళ్లుగా జట్టుకు వెన్నెముకలా నిలిచిన ధోనీ ఐదు టైటిళ్లు అందించి చెన్నై జట్టును అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీల్లో ఒకటిగా నిలిపాడు. అయితే ఈ సీజన్‌లో మాత్రం అభిమానులకు తీవ్ర నిరాశ ఎదురైంది. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా ధోనీ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ సీజన్‌లోనైనా చివరి ఓవర్లలో ధోనీ మెరుపులు చూడాలని అభిమానులు ఆశగా ఎదురుచూశారు. కానీ గాయాల కారణంగా అతడు జట్టుకు దూరంగానే ఉన్నాడు. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్ లీగ్ దశలో 13 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. గురువారం గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్ వేదికగా చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో అయినా ధోనీ బరిలోకి దిగుతాడని అభిమానులు భావించినప్పటికీ, అలాంటి అవకాశాలు కనిపించడం లేదు. ఎందుకంటే ధోనీ అహ్మదాబాద్‌కు వెళ్లకుండా రాంచీకి వెళ్లినట్లు సమాచారం. దీంతో గుజరాత్‌తో జరిగే మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం చెన్నై జట్టు 12 పాయింట్లతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో కొనసాగుతోంది. గుజరాత్‌పై గెలిస్తే ఖాతాలో 14 పాయింట్లు చేరతాయి. అదే సమయంలో పంజాబ్, కోల్‌కతా, రాజస్థాన్ జట్లు తమ చివరి మ్యాచ్‌ల్లో ఓడిపోతే చెన్నైకి ప్లేఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉండే అవకాశం ఉంది. ఒకవేళ అద్భుతంగా చెన్నై ప్లేఆఫ్స్‌కు చేరితే ధోనీ మళ్లీ జట్టులోకి వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో అభిమానులు మరోసారి ధోనీని మైదానంలో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# జకోవిచ్‌కు కొత్త కోచ్..

## 25వ గ్రాండ్‌స్లామ్‌పై గురి

**పారిస్, మే 21:** ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందు ప్రపంచ టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. గత ఏడాది నుంచి స్థిరమైన ప్రధాన కోచ్ లేకుండానే టోర్నీల్లో పాల్గొంటున్న జకోవిచ్ ఇప్పుడు తన స్వదేశానికి చెందిన మాజీ టెన్నిస్ ఆటగాడు విక్టర్ ట్రాయ్‌స్కీని హెడ్ కోచ్‌గా నియమించుకున్నాడు. ఈ విషయాన్ని జకోవిచ్ స్వయంగా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించడంతో టెన్నిస్ ప్రపంచంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు కోర్టులో కలిసి ఆడిన స్నేహితులు అయిన జకోవిచ్, ట్రాయ్‌స్కీ ఇప్పుడు గురు–శిష్యులుగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. "నా స్నేహితుడు, నా సహచరుడు.. ఇప్పుడు నా కోచ్. విక్టర్ ట్రాయ్‌స్కీకి స్వాగతం" అంటూ జకోవిచ్ చేసిన పోస్టు అభిమానులను ఆకట్టుకుంది. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచి చరిత్ర సృష్టించిన జకోవిచ్ గత రెండేళ్లుగా 25వ టైటిల్ కోసం ఎదురు చూస్తున్నాడు. మే 22తో 39వ ఏట అడుగుపెట్టనున్న ఈ సెర్బియా




స్టార్ ఇంకా తనలోని పోరాట స్ఫూర్తి తగ్గలేదని నిరూపించాలనే పట్టుదలతో ఉన్నాడు. ప్రస్తుతం టెన్నిస్ ప్రపంచాన్ని శాసిస్తున్న యువ ఆటగాళ్లు జన్నిక్ సిన్నర్, కార్లోస్ అల్కరాజ్‌లకు గట్టి పోటీ ఇవ్వాలంటే తన ఆటను మరింత మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని భావించిన జకోవిచ్.. అందుకే అనుభవజ్ఞుడైన ట్రాయ్‌స్కీని కోచ్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విక్టర్ ట్రాయ్‌స్కీ కూడా సెర్బియాకు చెందిన ప్రముఖ మాజీ టెన్నిస్ ఆటగాడే. జకోవిచ్‌తో కలిసి సెర్బియా జట్టుకు పదేళ్లకుపైగా ఆడిన అనుభవం అతనికి ఉంది. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత కోచింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ట్రాయ్‌స్కీ, కొంతకాలంగా జకోవిచ్ బృందంలో భాగంగానే కొనసాగుతున్నాడు. ముఖ్యంగా ఒలింపిక్స్‌లో జకోవిచ్ విజయానికి వెనుక అతని పాత్ర కూడా ఉందని టెన్నిస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పుడు పూర్తి స్థాయి హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టిన ట్రాయ్‌స్కీ, జకోవిచ్‌కు ఎంతోకాలంగా ఊరిస్తున్న 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. రోలాండ్ గారోస్ వేదికగా జరగనున్న ఫ్రెంచ్ ఓపెన్ నుంచే వీరి గురు–శిష్యుల ప్రయాణం అధికారికంగా మొదలుకానుంది. ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే ఫ్రెంచ్ ఓపెన్‌లో జకోవిచ్ ప్రదర్శనపై ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. వయసు పెరిగినా తన పట్టుదల, అనుభవం, మానసిక ధైర్యంతో మరోసారి చరిత్ర సృష్టించగలడా అనే చర్చ టెన్నిస్ అభిమానుల్లో జోరుగా సాగుతోంది.

# మళ్లీ ఫామ్‌లోకి త్రిష

## హీరోయిన్ల మధ్య కొత్త పోటీ



దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్ త్రిష పేరు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. దాదాపు రెండు దశాబ్దాలుగా తన నటన, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న త్రిష.. మధ్యలో కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. ఆ సమయంలో ఆమె రాజకీయాల్లోకి వెళ్లబోతున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగింది. దీంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఆ వార్తలన్నీ కేవలం పుకార్లేనని, తన దృష్టి పూర్తిగా సినిమాలపైనే ఉందని త్రిష స్పష్టం చేయడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే విడుదలైన 'కరుప్పు' సినిమా త్రిష కెరీర్‌కు మళ్లీ కొత్త ఊపును తీసుకొచ్చింది. తమిళనాడులో ఈ చిత్రం మంచి వసూళ్లు సాధిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దీంతో త్రిష కెరీర్ ముగిసిందని భావించిన విమర్శకులు కూడా ఇప్పుడు ఆమె సక్సెస్‌ను ప్రశంసిస్తున్నారు. ఈ విజయం తర్వాత త్రిష మళ్లీ వరుస సినిమాలతో బిజీ అవుతారా.. లేక ఎంపిక చేసిన కథలతో మాత్రమే ముందుకు వెళ్తారా అన్న చర్చ సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. త్రిష ఒకవేళ భవిష్యత్తులో సినిమాలకు విరామం ఇస్తే.. ఆమె స్థానం ఎవరు భర్తీ చేస్తారన్న చర్చ కూడా ఇండస్ట్రీలో మొదలైంది. ప్రస్తుతం కొత్త హీరోయిన్లు ఎంతోమంది వస్తున్నప్పటికీ.. సీనియర్ స్టార్ హీరోయిన్ల స్థాయిలో మార్కెట్‌ను నిలబెట్టుకోవడం అంత సులువు కాదని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో తమన్నా, కాజల్ అగర్వాల్ పేర్లు ముందుగా వినిపిస్తున్నాయి. తమన్నాకు ఇప్పటికీ అవకాశాలు వస్తున్నప్పటికీ.. మహిళా ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఒంటరిగా విజయవంతం చేసే స్థాయిలో ఇటీవల ఆమెకు పెద్ద హిట్‌లు రావడం లేదు. మరోవైపు కాజల్ అగర్వాల్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించినప్పటికీ.. ఆశించిన స్థాయిలో మళ్లీ బలమైన మార్కెట్‌ను సొంతం చేసుకోలేకపోయారు. దీంతో త్రిష స్థాయిని పూర్తిగా భర్తీ చేయడం వీరికి అంత సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక త్రిష స్థానం విషయంలో ఎక్కువగా వినిపిస్తున్న మరో పేరు నయనతారది. ఇప్పటికే దక్షిణాదిలో అత్యంత భారీ మార్కెట్ కలిగిన హీరోయిన్లలో నయనతార ముందంజలో ఉన్నారు. ఆమె నటిస్తున్న చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తున్నాయి. దీంతో త్రిష సినిమాలకు దూరమైతే.. ఆ మార్కెట్‌ను పూర్తిగా నయనతార తన ఆధీనంలోకి తెచ్చుకునే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.అయితే సినీ పరిశ్రమలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయని, ఒక్క విజయంతోనే సమీకరణాలు పూర్తిగా మారిపోతాయని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం 'కరుప్పు' విజయంతో మళ్లీ వార్తల్లో నిలిచిన త్రిష.. ఈ అవకాశాన్ని ఎలా వినియోగించుకుంటారన్నదే ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.




# ఉప్పెనను మించిన ట్విస్ట్ ఉంటుంది

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా బుచ్చిబాబు, రామ్ చరణ్ కార్ డ్రైవ్ చేస్తూ ఇంటర్వ్యూ నిర్వహించారు. 'మీకు ఇష్టమైన ఎపిసోడ్ ఏది?' అని దర్శకుడు అడగ్గా.. 'ఢిల్లీ ఎపిసోడ్ చాలా బాగుంటుంది. సినిమాలో నాకు ఇష్టమైన పార్ట్ అది. 'పెద్ది' మొత్తంలో ఎక్కువ మలుపులు ఉండేది ఆ ఎపిసోడ్‌లోనే కదా.. ఉప్పెనలో ట్విస్ట్ కంటే 100రెట్లు ఎక్కువ ఉంటుంది ఆ ఎపిసోడ్ అని చెప్పారు



# 'లగ్గం' సినిమా హీరోయిన్ హాట్ షో

దక్షిణాది సినీ పరిశ్రమలో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న యువ నటి ప్రగ్యా నగ్రా మరోసారి సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఆమె పంచుకున్న తాజా ఫొటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తూ విపరీతంగా వైరల్ అవుతున్నాయి. స్టైలిష్ లుక్స్, ట్రెండీ కాస్ట్యూమ్స్‌తో కనిపించిన ప్రగ్యా నగ్రా ఫొటోలకు అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా యువత సోషల్ మీడియాలో ఈ ఫొటోలను విస్తృతంగా పంచుకుంటూ ప్రశంసలు కురిపిస్తోంది. హర్యానాలోని అంబాలాలో కాశ్మీరీ కుటుంబంలో జన్మించిన ప్రగ్యా నగ్రా చిన్నప్పటి నుంచే కళలపై ఆసక్తి పెంచుకున్నారు. ఆమె తండ్రి సైనికాధికారి కావడంతో దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీలో ఇంజినీరింగ్ చదివిన ఆమె, తర్వాత మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి తన కెరీర్‌ను ప్రారంభించారు. వందకు పైగా వాణిజ్య ప్రకటనల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యా నగ్రా, తన అందం మరియు కెమెరా ముందు ఉన్న ఆత్మవిశ్వాసంతో సినీ అవకాశాలను అందుకున్నారు. రెండువేల ఇరవై రెండులో విడుదలైన తమిళ చిత్రం 'వరలారు ముఖ్యమ్' ద్వారా హీరోయిన్‌గా సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె, తొలి సినిమాతోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అనంతరం మలయాళంలో సుందరి యమునా' చిత్రంలో నటించి ప్రశంసలు అందుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు 'లగ్గం' సినిమా ద్వారా పరిచయమైన ప్రగ్యా నగ్రా, తన సహజ నటనతో మంచి గుర్తింపును సంపాదించారు. ఇటీవల ఆమె సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఫొటోల్లో ఆధునిక దుస్తుల్లో గ్లామరస్‌గా కనిపించారు. ఫ్యాషన్, స్టైల్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించే ప్రగ్యా నగ్రా ప్రతి ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ఆమె ఫొటోలకు వేల సంఖ్యలో లైక్స్, కామెంట్లు వస్తుండగా, పలువురు సినీ అభిమానులు "గ్లామర్ క్వీన్", "స్టైలిష్ స్టార్" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రగ్యా నగ్రా చేతిలో పలు దక్షిణాది చిత్రాలు ఉన్నట్లు సమాచారం. వరుస ఫొటోషూట్లు, కొత్త ప్రాజెక్టులతో ఆమె సినీ రంగంలో మరింత బిజీగా మారుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

# చిరంజీవి 158వ చిత్రం

## క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్‌కల్యాణ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం గురువారం మొదలైంది. కె.ఎస్.రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై కె. నారాయణ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్లాప్ కొట్టారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోకు చిరంజీవి, తన సోదరుడు పవన్‌కల్యాణ్ ఒకే కారులో వచ్చారు. తదుపరి నాగబాబు జాయిన్ అయ్యారు. ముగ్గురు కలిసి ఒకే సోఫాలో కూర్చుని చక్కగా ముచ్చటించుకున్నారు. చిరంజీవి పక్కన ఉన్నంత సేపు పవన్ ఎంతో వినయంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసి అభిమానులు సంబరపడిపోయారు. చాలాకాలం తర్వాత ముగ్గురు సోదరులను ఒకే వేదికపై చూడటం కనుల విందుగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ ఫొటోలను చిత్రించిన పట్టు శాలువాతో చిరంజీవిని సన్మానించింది చిత్ర బృందం. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌కల్యాణ్‌కి భక్తుడైన బండ్ల గణెశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండ్లను చూడగానే పవన్ దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి మాట్లాడుతూ లోపలికి తీసుకెళ్లారు. ఆ కాసేపు బండ్ల మొహం హై వోల్టేజ్ బల్బ్‌లా వెలిగిపోయింది. ఎప్పటిలాగే వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడారు బండ్ల గణెశ్. చిరంజీవి సైతం బండ్లను హత్తుకున్నారు. అభిమానులు మాత్రం 'బండ్లన్నకు ఇవాళ పండగే.. ఆయన అభిమానించే హీరోలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ రోజు ఆయనకు నిద్ర పట్టదేమో' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనశ్వర రాజన్ కూడా హాజరయ్యారు. ఈ చిత్రంలో ఆమె చిరుకు కుమార్తెగా కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది.



# చిరుకు కూతురిగా అనస్వర

చిత్రపరిశ్రమలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్‌లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్‌ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతోంది. ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్‌ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్‌కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్‌లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి- బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com